నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: కిష్టాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా ఈనెల 25న పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంబాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోసాయిగూడ, కిష్టాపూర్ ఏడీఏ, ఐడీఏ కండ్లకోయ, ఐడీఏ మేడ్చల్ 1, చెక్‌పోస్ట్, వాటర్ గ్రిడ్, ఏడీఏ మేడ్చల్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఘట్‌కేసర్: ఎదులాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ మల్కాజిగిరి పాఠశాల, కళాశాలలో వృత్తి నైపుణ్యం ఉచిత శిక్షణకు పూర్వ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాము, వైస్ ప్రిన్సిపాల్ రాములు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. మల్కాజిగిరి పాఠశాల, కళాశాలలో 2017 నుంచి విద్యనభ్యసించి ఉద్యోగం పొందని 19–25 ఏళ్ల మధ్య వయస్సున్న పూర్వ విద్యార్థులు జీవితంలో స్థిరపడేందుకు అవసరమైన వృత్తి నైపుణ్యం మెళకువలు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేర్పిస్తామన్నారు. ఆసక్తి గల పూర్వ విద్యార్థులు అదే కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 7995010640 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

రజక సంఘం జిల్లా యూత్ అధ్యక్షుడిగా సాయికుమార్



సాయికుమార్‌కు నియామకపత్రం ఇస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు గోపి

జవహర్‌నగర్: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రజక రిజర్వేషన్ సమితి యూత్ అధ్యక్షుడిగా సాయికుమార్ ఎన్నికయ్యారు. జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేడ్కర్‌నగర్ రజక సంఘం కమ్యూనిటీ హాల్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు గోపి రజక, ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్ రజక, జిల్లా అధ్యక్షుడు శాగంటి వెంకటేశ్ ఆధ్వర్యంలో సాయికుమార్‌ను ఎన్నుకుని నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాంబ రాజుకుమార్, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

కుర్చీ కాదూ... ప్రమాద సూచిక..!



గుంతలో ఏర్పాటు చేసిన కుర్చీ

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలకేంద్రంలో ఉద్దమర్రి–మూడుచింతలపల్లి రోడ్డులోని కల్వర్టు వద్ద రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారింది. దీంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇటీవల పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురికావడంతో స్థానికులు ప్రమాదకర గుంతను గుర్తించేందుకు గుంతలో ఓ కూర్చీని పెట్టి దానికి సంచిని కట్టి ఉంచారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

యువతి ఆత్మహత్య

మల్కాజిగిరి: యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సునీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి పాటిగడ్డతండాకు చెందిన మన్యం పదేళ్లుగా మల్కాజిగిరి ఇందిరానెహ్రూనగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఈనెల 23 న మన్యం కూతురు సరోజ (19) ఇంట్లో ఉండగా మన్యం భార్య ఇద్దరు కుమారులతో కలిసి పనికి వెళ్లాడు. సాయంత్రం మన్యం కుమారుడు చరణ్ ఇంటికి వచ్చి తలుపు తట్టినా తీయలేదు. ఇరుగుపొరుగు వారితో కలిసి తలుపు పగులగొట్టి చూడగా సరోజ ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది.'నా చావుకు నేనావత్ జితేందర్' కారణమని సూసైడ్ నోట్‌లో తెలిపిందన్నారు. గతంలో కూడా ప్రేమ పేరిట వేధిస్తున్నాడని ఫిర్యాదు చేయగా రిమాండ్ చేశారని పేర్కొన్నారు. మృతురాలి తండ్రి మన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

మల్కాజిగిరి: యువకుడు అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇందిరానెహ్రూనగర్‌కు చెందిన ప్రశాంత్ (32), స్రవంతి భార్యాభర్తలు. ప్రశాంత్ కొంతకాలంగా పనికివెళ్లకుండా ఇంటివద్దే ఉంటున్నాడు. ఈనెల 21న బయటకు వెళ్లిన ప్రశాంత్ తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడం, సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండడంతో స్రవంతి శుక్రవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ధ్రువీకరణ పత్రాల కోసం తిప్పలు..!

- విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సర్టిఫికెట్లు తప్పనిసరి
- కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- మీ–సేవా కేంద్రాలు, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 58 మండలాలు

సాక్షి,సిటీబ్యూరో: విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకత లోపిస్తోంది. విద్యాసంస్థల్లో ప్రవేశాలు పొందే సమయం కావడంతో సర్టిఫికెట్ల కోసం మీ–సేవా కేంద్రాలు, తహసీల్ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రేటర్‌తో సహా శివారులో మొత్తంగా (హైదరాబాద్ జిల్లాలో 16, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో 15, రంగారెడ్డి జిల్లాలో 27) 58 మండలాలు ఉన్నాయి. ఇందులో కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగుతుంటే.. మరికొన్ని చోట్ల నిబంధనల పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరాకరణ..

గ్రేటర్‌తో సహా శివారులోని పలు మండలాల్లో ఫ్యామిలీ మెంబర్ (కుటుంబ సభ్యుల) ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జారీ చేయడం లేదు. కొన్నిచోట్ల మాత్రం మాన్యువల్‌గా ఇస్తున్నారు. అయితే ఇవి అన్ని చోట్ల చెల్లడం లేదు. ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలతో న్యాయస్థానాల్లో కేసులు వేస్తున్నారనే కారణంగా వీటి జారీకి రెవెన్యూ అధికారులు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముందే చేయించాలట..

కుల, ఆదాయ, నివాస, ఓబీసీ తదితర ధ్రువీకరణపత్రాల జారీ కోసం మీ– సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేస్తే కొందరు నిర్వాహకులు నేరుగా తీసుకోవడం లేదు. ముందుగా సదరు ఫారాలపై ఆర్ఐతో సంతకం తీసుకుని రావాలంటూ సూచిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో చేసేదేమి లేక సదరు అధికారి కోసం తహసీల్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. సంతకం పూర్తయ్యాక మళ్లీ మీ–సేవాకు వెళ్లి దరఖాస్తు చేసి, తిరిగి సదరు ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. వాస్తవంగా ధ్రువీకరణ పత్రాల కోసం ఎక్కడైనా మీ– సేవాలో దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు ఫారాలపై ముందస్తుగా ఏ అధికారి సంతకం అవసరం లేదు. ప్రక్రియ పూర్తయ్యాక సదరు ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాల్సిన బాధ్యత కూడా మీ–సేవా కేంద్రాల నిర్వాహకులే చేయాల్సి ఉంటుంది.

అన్నీ తామై..

మీ–సేవా నుంచి వెళ్లిన దరఖాస్తులను ఆర్ఐ, తహసీల్దార్ లాగిన్లలో ఓకే చేసిన తర్వాతే ఆపరేటర్ ఓకే చేయాలి. కానీ సదరు అధికారులు పనుల్లో తీరిక లేకుండా ఉండడంతో వాటిని ఆపరేటర్లకు అప్పగిస్తున్నారు. ఇది వారికి కలిసి వస్తోంది. అన్నీ తామై నడిపిస్తున్నారు.

పాత ధ్రువీకరణ పత్రాలు ..

నూతన ధ్రువీకరణ పత్రాల జారీలో కొందరు తహసీల్దార్లు పాత సర్టిఫికెట్లు జత చేయాలని పేర్కొంటున్నారు. ఉదాహరణకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే పాతది జత చేయాలని సూచిస్తున్నారు. అది లేకుంటే కుటుంబంలో ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. లేకుంటే కొత్తవి ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం ఏ పాత ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం లేదు.

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



కేశవరంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

శామీర్‌పేట్: అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి, కేశవరం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి త్వరగా రైస్ మిల్లులకు తరలించి ఓపీఎంఎస్ ఎంట్రీలను వెంటనే పూర్తి చేయాలని సెంటర్ ఇన్‌చార్జిలను ఆదేశించారు. కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డీఎం సుగుణాబాయి, మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ వెంకట నర్సింహారెడ్డి, డీటీసీలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి పెట్టాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

మేడ్చల్‌రూరల్: రైతులు వరికి బదులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలని శాస్త్రవేత్తలు సూచించారు. మేడ్చల్ మండలంలోని కండ్లకోయ, బండమాదారం, ఎల్లంపేట్, ఘనాపూర్ గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' అనే కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు డాక్టర్ వసంత, డా. పుష్పవల్లి, స్వర్ణలత, వరప్రసాద్ మాట్లాడుతూ.. యూరియాను మోతాదుకు మించి వాడవద్దన్నారు. కూరగాయల సాగుతో అధిక లాభాలు పొందవచ్చన్నారు. పచ్చిరొట్ట ఎరువులు వాడితే భూసారం పెరుగుతుందని పేర్కొన్నారు. వరి పంటలో తెగుళ్లు, పురుగులను తట్టుకునే విత్తనాలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ అర్చన, ఏఈఓలు సునీత, తేజస్విని, రైతులు పాల్గొన్నారు.



శిక్షణ శిబిరంలో ఉపాధ్యాయులు

ముగిసిన శిక్షణ తరగతులు

కీసర: నాగారం సెయింట్ మార్టిన్ స్కూల్‌లో జరుగుతున్న కీసర మండల ప్రాథమిక స్థాయి 5 రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కీసర ఎంఈఓ ఎం.జమదగ్ని మాట్లాడుతూ.. శిక్షణలో నేర్చుకున్న అంశాలను విద్యార్థులకు బోధించాలన్నారు. తరగతి వారీగా కనీస సామర్థ్యాలను సాధించి కీసర మండలం జిల్లాలోనే విద్యా ప్రమాణాల పరంగా మొదటి స్థాయిలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'వైట్ టీ షర్ట్ ఉద్యమం' గొప్పది

జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను ఛిబ్



శిబిరంలో జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను ఛిబ్, నాయకులు

కీసర: రాహుల్‌గాంధీ చేపట్టిన 'వైట్ టీ షర్ట్ ఉద్యమం' చాలా గొప్పదని జాతీయ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఉదయ్‌భాను ఛిబ్ అన్నారు. కీసర బాల వికాస కేంద్రంలో నిర్వహిస్తున్న 'వైట్ టీ షర్ట్ శిక్షణ శిబిరం' శనివారం ముగిసింది. ఆయన హాజరై మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత యువ నాయకులపై ఉందన్నారు. బీజేపీ ప్రభుత్వం పేదలు, కార్మిక వర్గానికి వెన్నుపోటు పొడిచి కొంతమంది పెట్టుబడిదారులను సంపన్నం చేయడంపైనే ఉందన్నారు. ఇందుకోసం బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేయాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు జక్కిడి శివచరణ్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల నూతన ఫోన్ నంబర్లు

ఘట్‌కేసర్: విద్యుత్ శాఖ అధికారుల ఫోన్ నంబర్లు అధికారికంగా మారాయని విద్యుత్ శాఖ అధికారులు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. అత్యవసర సమయంలో ఏఈ 8712471631, లైన్ ఇన్‌స్పెక్టర్ 8712471643, ఫ్యూజ్ కోసం 8712471682, ఘట్‌కేసర్ సబ్‌స్టేషన్ 8712471653, అంకుషాపూర్ సబ్‌స్టేషన్ 8712471655, కొండాపూర్ సబ్‌స్టేషన్ 8712471671 నంబర్లలో సంప్రదించాలని వారు సూచించారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

మేడ్చల్: సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివి ఖాళీగా ఉన్న విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు కిష్టాపూర్ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ లలిత శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ చదివి నిరుద్యోగులుగా ఉన్న బాలబాలికలకు యూఎన్‌ఎక్స్ సంస్థ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు పలు రంగాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈనెల 30 లోగా బయోడేటాతో 9704550234 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో సబ్సిడీ విత్తనాలు

శామీర్‌పేట్: సబ్సిడీపై జనుము, జీలుగా విత్తనాలు అందుబాటులో ఉన్నాయని శామీర్‌పేట మండల వ్యవసాయాధికారి రమేశ్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పచ్చిరొట్ట విత్తనాల వల్ల భూమి సారవంతం పెరిగి దిగుబడులు అధికమవుతుందని పేర్కొన్నారు. పచ్చిరొట్ట ఎరువులు జనుము, జీలుగా విత్తనాలు 50 శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని, జనుము 40 కిలోల బస్తా ధర రూ. 5020 కాగా సబ్సిడీపై రూ. 2510 చెల్లించాలని అదేవిధంగా జీలుగా 30 కిలోల బస్తా ధర రూ. 4276 కాగా సబ్సిడీపై రూ. 2138 చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కావాల్సిన రైతులు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని ఆయన సూచించారు.

హైడ్రా అడ్డుకున్నా.. ఆగని కబ్జా...!



రోడ్డుపై అడ్డంగా తవ్విన భారీ గుంత

శామీర్‌పేట్: ప్రజా అవసరాలకు ఉపయోగపడే రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించుకున్నారని హైడ్రా అధికారులు ఇటీవల అక్రమ నిర్మాణాలు, అడ్డంకులను తొలగించారు. అయితే కొద్ది రోజులకే అక్రమార్కులు రోడ్డును తిరిగి కబ్జా చేసిన ఘటన తూంకుంట మున్సిపాలిటీలోని దేవరయాంజాల్‌లో జరిగింది. దేవరయాంజాల్ పరిధిలోని సర్వే నంబర్ 693, 694, కండ్లకోయ రెవెన్యూ పరిధిలో 135,136 సర్వే నంబర్లలో గల పబ్లిక్ రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించారని హైడ్రాను ఆశ్రయించారు. దీంతో ఏప్రిల్ 30న హైడ్రా అధికారులు ఆక్రమణలను తొలగించి రోడ్డును ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు. కాగా ఆక్రమణదారులు ఇటీవల ఆ రోడ్డుపై భారీ గుంతలను తవ్వి వాహనదారులు అటు వైపు వెళ్లే వీలు లేకుండా చేసి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. దీంతో ఆక్రమణదారుల నుంచి రోడ్డును కాపాడి తమ సమస్యను పరిష్కరించాలని స్థానికులు హైడ్రా అధికారులను కోరుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్, పోలీసులు

అల్వాల్: ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే దొంగతనాల నివారణ సాధ్యమవుతుందని ఎస్ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. నేరేడ్‌మెట్ సూర్యనగర్‌లోని ఫంక్షన్‌హాల్‌లో శనివారం ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఇటీవల సైబర్ నేరాలు అధికమయ్యాయని, తెలియని నంబర్ల నుంచి కాల్స్ వస్తే వివరాలు చెప్పవద్దన్నారు. బ్యాంకులు, పోలీస్, ఇతర సంస్థలు నేరుగా ఫోన్ చేసి వివరాలు సేకరించరని, అనుమానం ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సైబర్ క్రైం జరిగిన గంటలోనే కేసు నమోదు చేస్తే సొత్తు రికవరీకి అవకాశం అధికంగా ఉంటుందన్నారు. అలాగే ఇంటికి తాళం వేసి బయటకి వెళ్లినపుడు తాళం కనిపించకుండా డోర్ ముందు కర్టెన్ వేయాలని, రాత్రుల్లో ఇంట్లో లైట్ వేసి ఉంచాలని, ఎక్కువ రోజులు ఊరికి వెళ్లాల్సి వస్తే పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో కాలనీ ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నిర్మించి..వదిలేశారు..!



కండ్లకోయలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

మేడ్చల్‌రూరల్: 'స్వచ్ఛ సర్వేక్షణ్'లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ కండ్లకోయ చౌరస్తాలో మరుగుదొడ్లను నిర్మించి వదిలేశారు. పనులు పూర్తయి రెండేళ్లు కావస్తున్నా.. వినియోగంలోకి తీసుకురాకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయి. ఎప్పుడు చూసినా మరుగుదొడ్లకు తాళాలు వేసి ఉండడంతో ప్రజలు బహిరంగ మల, మూత్ర విసర్జన చేస్తున్నారు. ప్రభుత్వం రూ.లక్షల ఖర్చు చేసి నిర్మించినప్పటికీ అధికారుల అలసత్వం వల్ల ప్రభుత్వ లక్ష్యానికి గండిపడుతోంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు మరుగుదొడ్లను అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

మల్లాపూర్: నాచారం డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ అల్ అక్సా మసీద్, చర్చి రోడ్డులో రూ.35 లక్షల వ్యయంతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ శాంతితో కలిసి శనివారం శంకుస్థాపన చేశారు. చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న భూగర్భ డ్రైనేజీ, సీసీ రోడ్డు పనులకు మోక్షం కలగడంతో కాలనీవాసులు ఎమ్మెల్యే, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డీఈ బాలకృష్ణ, ఏఈ కీర్తి వినీత్, స్థానిక నేతలు సాయిజెన్ శేఖర్, మల్లేశ్ యాదవ్, కట్ట బుచ్చన్నగౌడ్, ప్రీతిరెడ్డి, యాదగిరి, రాజ బాబు, రాంచందర్, గణేశ్, సుగుణాకర్‌రావు, అజ్మీరి, శ్రీనివాస్ సంపత్ యాదవ్ పాల్గొన్నారు.

అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు..

కుషాయిగూడ: మీర్‌పేట్–హెచ్‌బీకాలనీ డివిజన్ కృష్ణానగర్, భక్షిగూడ కాలనీల్లో రూ. 33.50 లక్షల వ్యయంతో తలపెట్టిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి స్థానిక కార్పొరేటర్ ప్రభుదాస్‌తో కలిసి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్‌రెడ్డి, వాటర్‌వర్క్స్ డీజీఎం సతీశ్, నాయకులు గుమ్మడి జంపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, మల్లారెడ్డి, బుచ్చిరెడ్డి, హరినాథ్‌రెడ్డి, భూపాల్‌గౌడ్, బాలయ్య, అంజయ్య పాల్గొన్నారు.

ముగిసిన మహాలక్ష్మి ఆలయ వార్షికోత్సవం



కల్యాణోత్సవం జరిపిస్తున్న దృశ్యం



ఎంపీ ఈటలకు ఆహ్వానం పలుకుతున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

మౌలాలి : ప్రశాంత్‌నగర్ హెచ్‌బీకాలనీలోని మహాలక్ష్మీ అమ్మవారి ఆలయ 23వ వార్షిక వేడుకలు శనివారం వైభవంగా ముగిశాయి. చివరిరోజు భాజ భజంత్రీలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ గున్నాల సునీత హాజరై ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బేతి సుభాష్‌రెడ్డి, శివగౌడ్, వెంకటేశ్, ఆలయ కమిటీ అధ్యక్షుడు పైళ్ల బుచ్చిరెడ్డి, కమిటీ ప్రతినిధులు లక్ష్మీరెడ్డి, కేబీ ప్రసాద్, జితేందర్‌రావు, సంజీవరాణి, ప్రవీణ్, చంద్రమౌళి, జానయ్య, అశోక్‌గౌడ్, ప్రసాదరావు, విష్ణుమూర్తి, ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి

ఉప్పల్: ఉపాధ్యాయులు సుశిక్షితులు అయితేనే విద్యార్థులకు మెరుగైన విద్యను అందించగలుగుతారని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉప్పల్ జడ్పీ పాఠశాలలో ఉపాధ్యాయుల శిక్షణ తరగతులకు శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మూస పద్ధతిలో కాకుండా ఆధునిక పద్ధతులు, సరళమైన రీతిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి రామారావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సెట్విన్ సెంటర్‌లోనే కోర్టు

- భవనాన్ని బదలాయిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు
- పీర్జాదిగూడ నగర కమిషనర్ నుంచి పత్రాలు అందుకున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి



పీర్జాదిగూడ మున్సిపల్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్

మేడిపల్లి: మండలంలోని పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో కోర్టు ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యింది. ఇందుకోసం మేడిపల్లిలోని సెట్విన్ సెంటర్ భవనాన్ని కోర్టుకు బదలాయిస్తూ మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేయగా, పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావు సంబంధిత పత్రాలను ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్‌కు శనివారం అందజేశారు. మేడిపల్లిలోని ప్రభుత్వ స్థలం సర్వేనంబర్–103 లోని 1. 5 గుంటల విస్తీర్ణంలో గల సెట్విన్ సెంటర్ భవనం, ఖాళీ స్థలాన్ని తహసీల్దార్ హసీనా పంచనామా చేసి పత్రాలను జడ్జి శ్రీకాంత్‌కు అందజేశారు. ఇదిలాఉంటే ఇప్పటివరకు కొనసాగిన సెట్విన్ సెంటర్‌ను వేరే ప్రాంతానికి తరలించారు.



కోర్టుకు బదలాయించిన సెట్విన్ సెంటర్ భవన సముదాయం

3 మండలాలు, 4 పోలీస్‌స్టేషన్లు..

మేడిపల్లి జూనియర్ కోర్టు పరిధిలోకి మేడిపల్లి, ఘట్‌కేసర్, ఉప్పల్ మండలాలతో పాటు వాటి పరిధిలోని మేడిపల్లి, ఘట్‌కేసర్, ఉప్పల్, నాచారం పోలీస్ స్టేషన్లు వస్తాయి. మెట్రోపాలిటన్–4,5,6 కోర్టులు ఇక్కడ ఏర్పాటు కానున్నాయి, ఇందులో సివిల్, క్రిమినల్ కేసులకు సంబంధించిన కేసులు ఈ కోర్టు పరిధిలోకి రానున్నాయి.

కోర్టు కార్యకలాపాలు ఎప్పుడు ప్రారంభమో..

కోర్టు భవనం బదలాయింపు ప్రక్రియ పూర్తయినా.. త్వరగా కోర్టు సంబంధించిన కార్యకలాపాలు కొనసాగేలా లేవు. బదలాయింపు పత్రాలను అందుకున్న జిల్లా జడ్జి హైకోర్టుకు పంపించనున్నారు. దీనిపై హైకోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందనేది ప్రశ్నార్థకం. ప్రస్తుత భవనం కోర్టు కార్యకలాపాలకు సరిపోక కొత్తగా నిర్మించాల్సి ఉంది. పక్కా భవనం నిర్మించాల్సి వస్తే ఏడాదిపైనే సమయం పట్టే అవకాశం ఉందని పలువురు న్యాయవాదులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సౌజన్య, పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్ రావు, మేడిపల్లి తహసీల్దార్ హసీనా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ చంద్రకళ, న్యాయవాదులు వంగేటి ప్రభాకర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, రాఘవ రెడ్డి, మధుకర్ రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.